క్లుప్తంగా

నియామకం


అంకేశ్వరపు రమేశ్

నర్సంపేట : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జ తారకం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అంకేశ్వరపు రమేశ్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన రమేశ్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగస్వాముడయ్యాడని తెలిపారు. రమేశ్ సేవలను గుర్తించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకత్వం కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించిందన్నారు.

‘మన్‌కీ బాత్’ వీక్షణ



రాయపర్తి(వర్ధన్నపేట): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వర్ధన్నపేటలో కార్యకర్తలతో కలిసి వీక్షించినట్లు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. దేశాన్ని ఏవిధంగా అభివృద్ధి పథంలో నడిపించాలో ప్రధాని వివరించినట్లు పేర్కొన్నారు.

బియ్యం అందజేత



రాయపర్తి(వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని ఇల్లందకు చెందిన రాములు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని సీపీఐ నాయకులు ఆదివారం పరామర్శించి, బియ్యం, ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆరెల్లి ప్రభాకర్, బొడ్డుపల్లి సాయిలు, కడమంచి యాదగిరి, భిక్షపతి, పిల్లల సదానందం తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ రద్దు చేయండి



రాయపర్తి(వర్ధన్నపేట) : నీట్ పరీక్షను రద్దు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి అన్నారు. ఆదివారం వర్ధన్నపేటలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ నీట్ పరీక్ష ఎలాంటి ఫీజు లేకుండా మళ్లీ నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు ప్రభుత్వం సరైన న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మునిగాల అరుణ్, అనిల్‌కుమార్, తిరుమలేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



రాయపర్తి : విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని కొండూరులో ఆదివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం కొండూరుకు చెందిన మారబోయిన కుమార్‌కు తన వ్యవసాయ బావి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్కన మేత మేస్తుండగా ఎర్త్ రావడంతో మృతిచెందింది. సుమారు రూ.60వేల విలువ చేసే దుక్కిటెద్దు విద్యుదాఘాతంతో మృత్యువాత పడగా ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కుమార్ కోరుతున్నాడు.

మటన్ @ 900

పర్వతగిరి : మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం మాంసం విక్రయాలు జోరుగా ఉంటాయి. అయితే వేరే ప్రాంతాల్లో మేక, గొర్రె పోతు మాంసం రూ.800 కిలో ఉండగా, పర్వతగిరిలో కేజీ మాంసం రూ. 900లకు విక్రయిస్తున్నారు. అంతే కాకుండా రోగాల బారిన పడిన, మృతి చెందినవి గుట్టుచప్పుడు కాకుండా తెల్లవారుజామున విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

ఐనవోలు : ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పంథిని శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్‌కు చెందిన ప్రశాంత్ వరంగల్ నుంచి తొర్రూర్‌కు ఆదివారం బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్–ఖమ్మం రహదారి పంథిని శివారుకు చేరుకుని బ్రిడ్జి దాటుతున్న క్రమంలో అదుపు తప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టి కిందపడిపోయాడు. ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

వానొస్తే.. బడి బంద్


చెట్ల కింద ఆరుబయట పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు


చెరువును తలపిస్తున్న సర్వాపురం పాఠశాల ప్రాంగణం

- శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం
- చిన్నపాటి వర్షానికి కురుస్తున్న గదులు
- చినుకు పడితే పిల్లలకు ఇంటికే..
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నర్సంపేట రూరల్ : విద్యా బుద్ధులు నేర్పించే పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది.. స్లాబ్ పెచ్చులూడి పడడంతో భవనం మొత్తం కురుస్తోంది. వానొస్తే బడి బంద్ చేయాల్సి వస్తోంది. చినుకు పడితే పాఠశాల భవనంపై నీరు నిలిచి పూర్తిగా చిమ్ముటిస్తూ గది మొత్తం తడిసి ముద్దవుతోంది. ఆరుబయటకు పిల్లలను కూర్చోబెడుదామనుకుంటే పాఠశాల ఎదుట నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఈ పాఠశాలలో విద్యార్థులు ఉన్నా.. సౌకర్యాలు కల్పించకపోవడంతో పదేళ్లుగా పాఠశాల భవనం కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు నూతన భవనం కోసం ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులకు వినతులు చేస్తునే ఉన్నారు. దీంతో శిథిలమైన భవనాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీలు ఇస్తున్నారే తప్పా రూపాయి విదిల్చిన దాఖలాలు లేవు. దీంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వైపు మొగ్గు చూపే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

నర్సంపేటలోని సర్వాపురం ఎస్సీ కాలనీలో సుమారు 40 ఏళ్ల క్రితం రెండు గదులతో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. అప్పటి నుంచి పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు సైతం వచ్చి బోధన చేశారు. అయితే 20 ఏళ్ల క్రితం పూర్తిగా శిథిలావస్థకు చేరి చినుకు వర్షానికి కురుస్తుంది. అప్పట్లో రెండు గదుల తాత్కాలిక మరమ్మతు కింద స్లాబ్‌లు సైతం పోశారు. నాణ్యత లేకపోవడంతో పెచ్చులూడుతుండగా ఓ గదిని పూర్తిగా డిస్మెట్ చేశారు. మరో గదిని సైతం డిస్మెట్ చేయాల్సి ఉండగా గదులు లేకపోవడంతో అప్పటి నుంచి అందులోనే కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 36మంది విద్యార్థులు ఉన్నారు. గదులు లేకపోవడంతో చెట్ల కిందనే పాఠాలు బోధించాల్సి వస్తోంది. గదిలో పెచ్చులూడి పడడంతో విద్యార్థులకు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాఠాలు బయటనే బోధిస్తున్నారు. తక్షణమే నూతన భవనాన్ని మంజూరు చేసి నిర్మించాలని గత పదేళ్లగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వినతుల అందజేసిన పట్టించుకునే నాథుడే లేరు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించే పరిస్థితి నెలకొంది.

అధికారులకు విన్నవించాం..



పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇదే విషయంపై ప్రతిఏటా జిల్లా, మండల స్థాయి అధికారులకు వినతులు ఇస్తూనే ఉన్నాం. నూతన భవనం మంజూరు చేస్తామని హామీ ఇస్తున్నారే తప్పా నిధులు మంజూరు కావడంలేదు. దీంతో విద్యార్థులు ఆరుబయటనే బోధన చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది కొత్తగా విద్యార్థులు పాఠశాలలో సౌకర్యాలు లేవని చేరడం మానేశారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తామని చెబుతున్నారు.

\- కల్యాణి, ప్రధానోపాధ్యాయురాలు

పార్టీనుంచి ముగ్గురి సస్పెన్షన్


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

నెక్కొండ : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు పార్టీ నుంచి ముగ్గురిని సస్పెండ్ చేశామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ తెలిపారు. మండలంలోని పెద్దకొర్పోలులో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన మెండె రవి, దయ్యాల ఐలయ్య, బిర్రు కమలహాసన్‌లు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడునట్లు గ్రామ శాఖ అధ్యక్షుడు భీమన్న ఫిర్యాదు చేశారన్నారు. గతంలో పలుమార్లు హెచ్చరించినప్పటికి తీరుమారక పోవడంతో ఆరు నెలల పాటు సస్పెండ్ చేయాల్సి వచ్చిందన్నారు. సమావేశంలో నెక్కొండ రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, నాయకులు కేవీ సుబ్బారెడ్డి, కర్ర చెన్నారెడ్డి, పడాల రవి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు


ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : విదేశాల్లో పర్యటించి నర్సంపేటకు వచ్చిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఎంఎస్పీ, డీబీఆర్పీఎస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి గౌతమ బుద్ధుడి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీబీఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు అందె రవి, గుంపుల మాలతి, సరోజన, రేణుక, నారాయణ, వీరేశం, శ్రీకాంత్, సుధాకర్, భిక్షం, యాకయ్య, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంగెం : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించిన సందర్భంలో ముఖ్యమంత్రి పార్కుకు భూములు ఇచ్చిన నిర్వాసిత రైతులకు కేటాయించిన ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించడంతో పాటుగా మేజర్ గ్రామపంచాయతీలో ఉండే వసతులను కలిపించాలని అధికారులను ఆదేశించినందుకు కృతజ్ఞతగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, పరకాల అధికార ప్రతినిధి జనగాం రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, యూత్ అధ్యక్షుడు రాజు, మహిళా అధ్యక్షురాలు సంధ్య, రమాదేవి, ఎంపీటీసీ మల్లయ్య, నాయకులు జగన్నాధచారి, నాగరాజు, రాజ్‌కుమార్, లక్ష్మణ్, కుమారస్వామి, సదయ్య, చంద్రమౌళి, రాంరెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల సందర్శనకు తరలిన రైతులు



ఖానాపురం : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఖమ్మం జిల్లాలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంట సందర్శనకు ఆదివారం తరలి వెళ్లారు. హార్టికల్చర్ అధికారులు శ్రీనివాసరావు, జ్యోతి, కార్తీక్‌ల ఆధ్వర్యంలో ఖానాపురం, బుధరావుపేటతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు ఖమ్మం సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఉద్యానవన అధికారులు పంటల సాగులో రైతులు పాటిస్తున్న పద్ధతులు, ఆయిల్‌పామ్‌లో అంతర పంటల సాగు తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పరుచూరి సుబ్బారావు, కృష్ణారెడ్డి, వెంకటనారాయణ, రామారావు, ఎడ్ల వాసుదేవ రెడ్డి, గంధ్రాతి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బాలు, వెంకటేశ్వర్లు, ఖాసీంం, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక సమావేశం

ఖానాపురం : మండల కేంద్రంలోని రైతు వేదికలో రేపు(మంగళవారం) నిర్వహించే ప్రత్యేక సమావేశానికి సహకార సంఘం బాధ్యులు, మండల రైతులు హాజరుకావాలని ఏఓ శ్రీనివాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశంలో రైతు భరోసా పథకం అమలు కోసం రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా ఉన్నతాధికారులు సైతం హాజరవుతున్నారని, రైతులు తమ తమ అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం


దుగ్గొండి: సాయం అందజేస్తున్న మిత్రులు


గీసుకొండ: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఆర్థికసాయం అందజేస్తున్న హోంగార్డులు

గీసుకొండ : మండలంలోని సూర్యతండాకు చెందిన ఆంగోత్ రుక్మిణి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. కాంగ్రెస్ జిల్లా నాయకులు, సామాజిక సేవకుడు అల్లం బాల కిశోర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ. 5వేల నగదు అందజేశారు. ఆదివారం ఆయన అందించిన ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ నాయకులు అల్లం మర్రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, మాదాసి రాంబాబు, నాగారపు స్వామి తదితరులు బాధిత కుటుంబానికి అందించారు.

పరామర్శ

గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు, అతడి సోదరుడు రమేశ్‌ను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. వారి తల్లి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకడు గోపాల నవీన్‌రాజ్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కొమ్ముల కిషోర్, మాడిశెట్టి రాజయ్య, కొట్టి ముత్తన్న, కుమారస్వామి ఉన్నారు.

పర్వతగిరి : మండలంలోని తూర్పుతండా బీఆర్ఎస్ నాయకుడు బానోత్ శ్రీను ఆదివారం మృతిచెందాడు. కాగా ఏనుగల్ ఎంపీటీసీ కోల మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన బండారి లక్ష్మణ్ 20 రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తోటిమిత్రులు ఒక్కటై రూ.లక్ష జమచేశారు. కాగా ఆదివారం నాచినపల్లిలో మిత్రుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, మిత్రుడి భార్య కవిత, కుమార్తెలు , సహస్ర, కుమారుడు సాత్విక్‌లను ఓదార్చారు. అండగా ఉంటామంటూ ధైర్యం చెప్పారు. సహస్ర పేరున బ్యాంక్‌లో డిపాజిట్ చేసి రూ.లక్ష బాండ్‌ను చిన్నారులకు అందించారు. ఈ కార్యక్రమంలో టెన్త్ బ్యాచ్‌కు చెందిన 63 మంది మిత్రులు పాల్గొన్నారు.

రాయపర్తి(వర్ధన్నపేట) : మండలంలోని కట్ర్యాలకు చెందిన గారడి ముస్లిం సయ్యద్ ఖాసీం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మాజీ సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందించి ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. వర్ధన్నపేట మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సోఫీ, బైరి కుమారి, ముస్లింలు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన హోంగార్డు రాయపురం రాములు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తించారు. వర్ధన్నపేట సర్కిల్ మామునూరు పోలీస్ సబ్ డివిజన్ హోంగార్డుల బృందం ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించింది. అనంతరం రూ.30,200 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో హోంగార్డులు రవి, పూర్ణచందర్‌రెడ్డి, ఏలియా, చిరంజీవి, భాస్కర్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం స్థానిక హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులు లక్ష్మీనారాయణ, సాంబయ్య, జనార్దన్, కృష్ణమూర్తి, దేవేందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ చేయిస్తాం..

- ట్రాన్స్‌కో డీఈ శ్రీధర్

సాక్షి స్పందన


ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న డీఈ

దుగ్గొండి : ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని నర్సంపేట ట్రాన్స్‌కో డీఈ శ్రీధర్ అన్నారు. మండలంలోని నాచినపల్లిలో ‘బాబోయ్.. ట్రాన్స్‌ఫార్మర్’ శీర్షికన ఆదివారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ మేరకు స్పందించిన డీఈ ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండి పిల్లలు, పశువులు తాకితే ప్రమాదకరంగా ఉంటుందని రక్షణ కోసం వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానిక విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ నుంచి షిఫ్టింగ్ చార్జీలు చెల్లిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి మారుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ పాషా, లైన్‌మన్ అజయ్, రాజు, గ్రామస్తులు పుచ్చకాయల కృష్ణారెడ్డి, భిక్షపతి, స్వామి, మొండయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రావు

రాయపర్తి(వర్ధన్నపేట): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు అన్నారు. వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి స్వగృహంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏకకాలంలో రూ.లక్ష రైతు రుణాలను మాఫీచేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకకాలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రుణమాఫీ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ రైతుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న గౌడ్, బండౌతపురం మాజీ సర్పంచ్ మరుపట్ల సాయికుమార్, దమ్మన్నపేట చీరబోయిన రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ క్లబ్ ఏర్పాటు


ఎన్నికైన సీనియర్ సిటిజన్స్ క్లబ్ సభ్యులు


ఎన్నికైన నూతన కార్యవర్గం

చెన్నారావుపేట : సీనియర్ సిటిజన్స్ క్లబ్ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈగ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా వరంగంటి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ములుక సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీ నర్సింహచారి, అడుప సత్తయ్య, తాళ్లపల్లి కొమ్మాలు, కోశాధికారిగా వరంగంటి కుమారస్వామి, సంయుక్త కార్యదర్శులుగా ముత్యం సాంబయ్య, గట్ల కిష్టయ్య, ప్రచార కార్యదర్శిగా కేతిరి సమ్మిరెడ్డి, సభ్యులుగా దొనికెల వీరయ్య, కంది నారాయణ రెడ్డి, ఉపేంద్రచారి, రాదారపు ప్రతాపరెడ్డి, కోరె కట్టయ్య, ముఖ్య సలహాదారులుగా పత్తి సంజీవరెడ్డి, సిద్ధ కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఫ్రెండ్స్ యూత్ కమిటీ ఎన్నిక

మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదాసి ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా చాతాల్ల గణేష్, ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి సాగర్, కార్యదర్శులుగా జంగిలి భారత్, కోశాధికారి ఆకులపల్లి నరేష్, గౌరవ అధ్యక్షుడిగా బర్ల దేవదాసు, సభ్యులుగా సాధుశివ, అందె ప్రవీణ్, సాధు అనిల్, జంగిలి దిలీప్, కేశవ, పవన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు జంగిలి సమ్మయ్య, వ్యవస్థాపకులు సాధు నర్సింగరావు, నర్మెట్ట యాదగిరి, సాధు రాజు, మాజీ అధ్యక్షులు జంగిలి కిరణ్, అనిల్, సాగర్, అజయ్‌లు ఉన్నారు.

ట్రాన్స్‌కో.. జర దేఖో

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


ఒరిగిన విద్యుత్ స్తంభం

నెక్కొండ : నెక్కొండ పట్టణ శివారు పంటపొలాల్లో 11 కేవీ లైన్ విద్యుత్ స్తంభం ఓ పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రానికి చెందిన రైతు ఈదునూరి ప్రభాకర్ మాట్లాడుతూ.. మండలంలోని పత్తిపాక 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తన పంట భూమిలో ఒరిగిన స్తంభాన్ని అధికారులు సరిచేయడం లేదని వాపోయాడు. ఇదే విషయమై అధికారుల దృష్టికి తీసుక వెళ్లినా ఫలితం లేదన్నారు. విద్యుత్ తీగలు సైతం కిందకు వేలాడుతున్నాయని వర్షం కారణంగా స్తంభం పూర్తిగా నేలకూలే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత వానాకాలం పంటల సాగుకు వెళ్లే రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


శివ(ఫైల్)

ఖానాపురం : చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు మానెపల్లి శివ (35) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. కాగా కొద్ది నెలల క్రితం ఉద్యోగం కోసమంటూ రూ.4లక్షల అప్పు చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో జూన్ 28న ఉదయం పంట పొలాల వైపు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటికి ఫోన్ చేసి పురుగుల మందు తాగినట్లు విషయం తెలపడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన పొలం వద్దకు వెళ్లి శివను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం ప రిస్థితి విషమంగా ఉండటంతో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తండ్రి వద్దకు వెళ్తానని, తనను ఆపొద్దంటూ కుమారుడు రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. బాధిత కుటుంబ సభ్యులను ఎంపీపీ ప్రకాశ్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్యతో పాటు నర్సంపేటకు చెందిన జర్నలిస్టులు నివాళులర్పించారు.